సాక్షి
కర్నూలు

ఆదివారం । 3 । నవంబర్ । 2024



అన్నప్రసాదానికి పచ్చళ్ల విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు ఇబ్రహీం పట్నానికి చెందిన సత్యనారాయణ, బెంగళూరుకు చెందిన సుదర్శన్, చైతన్య రూ.3 లక్షల విలువైన పచ్చళ్లను విరాళంగా అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శనివారం రాజమండ్రికి చెందిన శ్యామ్ నృత్యనికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1.632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11.6670
అవుట్ ఫ్లో	:11.427



కర్నూలు నగరంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక వెలుగులు

పవిత్రమైన కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పుణ్యస్నానాలు, దీపారాధనలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారం, భోగేశ్వరాలయం, కాల్వబుగ్గ, సంగమేశ్వరం, రుద్రకోడూరు, మంత్రాలయం, ఉరుకుంద క్షేత్రాల్లో కార్తీక మాస పూజలు విశేషంగా చేపట్టారు. బలి పాడ్యమి నేపథ్యంలో ఆకాశ దీప వ్రతాన్ని ప్రారంభించారు.

– కర్నూలు కల్చరల్





శ్రీశైల క్షేత్రంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం, దీపారాధనలో భక్తులు

న్యూస్‌రీల్

పెన్షన్ల పంపిణీలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం

కర్నూలు (సెంట్రల్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కర్నూలు జిల్లా వరుసగా నాలుగోసారి ప్రథమ స్థానంలో నిలిచింది. నవంబర్ మాసంలో కూడా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో 99.46 శాతంతో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 2,41,029 పెన్షన్లు ఉండగా అందులో 2,39,718 పంపిణీ చేశారు. ఆగస్టు నెలలో 98.03 శాతం, సెప్టెంబర్‌లో 99.47 శాతం, అక్టోబర్ మాసంలో 99.13, నవంబర్ మాసంలో 99.46 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే పెన్షన్ల పంపిణీలో ముందుంటోంది.

స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (అర్బన్): విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల రిజిస్ట్రేషన్‌తో పాటు రెన్యూవల్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించిన ధృవపత్రం, ఆడిట్ రిపోర్ట్స్ (2020, 2023, 2024), సంఘంలోని సభ్యుల వివరాలు, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల పేపర్ క్లిప్పింగ్స్‌ను ఈనెల 10వ తేదీ లోపు తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు 08518–277864ను సంప్రదించాలని సూచించారు.

ముచ్చుమర్రికి నేడు వైఎస్సార్‌సీపీ బృందం రాక

పగిడ్యాల: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మైనర్ బాలిక కిడ్నాప్ హత్యోదంతం ఘటన బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ బృందం ఆదివారం మధ్యాహ్నం కొత్త ముచ్చుమర్రికి రానున్నట్లు ఆ పార్టీ సచివాలయ మండల కన్వీనర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఘటన జరిగి 120 రోజులవుతున్నా బాలిక మృతదేహాన్ని ప్రభుత్వం కనిపెట్టలేకపోవడం సిగ్గుచేటన్నారు. బాలిక తల్లిదండ్రులను పరామర్శించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ ముచ్చుమర్రికి రానున్నారన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

చూపు మందగిస్తోంది!

- ఈ–ఐ కేంద్రాల్లో నిలిచిన సేవలు
- పరీక్షలతో పాటు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ నిలిపివేత
- ఆసుపత్రుల నుంచి సామగ్రి తరలించుకు పోయిన అపోలో సంస్థ
- కంటి పరీక్షల కోసం ప్రజల అవస్థలు
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

పేదలపై ప్రభుత్వం చిన్న‘చూపు’ చూస్తోంది. గత ప్రభుత్వం పేదల ఆరోగ్య రక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలకు తూట్లు పొడుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నానాటికీ సేవలు తగ్గిపోతున్నాయి. సీఎం ఈ–ఐ కేంద్రాలకు చంద్ర గ్రహణం పట్టింది. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వృద్ధులతో పాటు, విద్యార్థుల కంటి వెలుగులు పంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను నిర్దాక్షిణ్యంగా మూసేసింది. ఉచితంగా అందే సేవలు ఇప్పుడు దూరం కావడంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. అందులో పనిచేసే సిబ్బందిని రోడ్డున పడేసింది. ముందస్తు సమాచారం లేకుండా మూతవేయటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

కర్నూలు(హాస్పిటల్): కంటి సమస్యలతో బాధపడే పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలందించేందుకు గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. ఆ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్య సంస్కరణలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలిపేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా అప్పట్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలైన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలతో పాటు కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా నిలిపివేసింది. ఫలితంగా రోగులు కంటి వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 9 కేంద్రాల్లో ఈ–ఐ కేంద్రాలను ఆయా ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో గత ప్రభుత్వంలో కొనసాగాయి. వీటిని అపోలో సంస్థ నిర్వహించింది. ప్రతి కేంద్రంలో రోజూ 15 నుంచి 20 మంది రోగులు చికిత్స పొందేవారు. నెలకు సగటున 350 నుంచి 400 వరకు రోగులు కంటి పరీక్షలు ద్వారా దృష్టిని మెరుగుపరచుకునే వారు. ఆయా కేంద్రాల్లో గత నెల నుంచి సేవలు నిలిపివేశారు. వీటిని కొనసాగించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో అపోలో సంస్థ వాటి పరికరాలను తీసుకుని వెళ్లిపోయింది. వీటిలో పనిచేసిన ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను సైతం తొలగించారు. వారికి చెల్లించాల్సిన వేతన బకాయిలు కూడా ఇంకా అందలేదు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో సీహెచ్‌సీలకు వస్తున్న పేద ప్రజలు మూతపడిన కేంద్రాలను చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇందులో కొందరు కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండే కంటి వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకుంటుండగా మరికొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.



వృద్ధుడికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

అప్పట్లో అద్భుతంగా కంటి వెలుగు కార్యక్రమం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గత ప్రభుత్వంలో విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మధ్యలో కొంత కాలం కోవిడ్ (కరోనా) రావడంతో లాక్‌డౌన్ కారణంగా 2020 మార్చి నెలాఖరు నుంచి అవ్వాతాతల కంటి వెలుగు పరీక్షలు నిలిచిపోయి అదే ఏడాది నవంబర్ 2 నుంచి కోవిడ్ జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షలను తిరిగి ప్రాంభమయ్యాయి. కంటి వైద్యులు ప్రజల ముంగిటకే వెళ్లి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న లోపాలున్న వారికి మందులు, దృష్టిలోపాలు ఉన్న వారికి కంటి అద్దాలు, కంట్లో సమస్యలున్న వారికి శస్త్రచికిత్సలు చేయిస్తూ కంటి వెలుగు ప్రసాదించారు. జిల్లాలో మూడో దశ కంటి వెలుగులో భాగంగా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని 2020 ఫిబ్రవరి 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లాలో ప్రారంభించారు. ఇందులో భాగంగా గత మార్చి వరకు 2,06,989 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35,786 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా 47,536 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించారు.

- ఆ తర్వాత జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్ వన్ వైద్యశిబిరాల్లోనూ కంటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు 556 వైద్యశిబిరాల్లో 32,655 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఇప్పటి వరకు 19,667 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 9,415 మందికి అవసరమైన మందులు అందజేశారు. 387 మందికి ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. మరో 3,186 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ నిర్వహించారు.
- జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్ టులో భాగంగా ఇప్పటి వరకు 217 వైద్యశిబిరాలు నిర్వహించారు. అందులో 8,080 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 5,417 మందికి కంటి అద్దాలు ఇవ్వాలని నిర్ణయించి ఇప్పటి వరకు 4,381 మందికి పంపిణీ చేశారు. 2,646 మందికి సాధారణ కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారించి మందులు ఇచ్చి పంపించారు. మరో 16 మందికి కాటరాక్టు ఉందని నిర్ధారించి ఆపరేషన్ చేశారు.
- అలాగే జిల్లాలోని 4,351 పాఠశాలల్లో ఉన్న 6,73,728 మంది 5 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 37,329 మందికి దృష్టిలోపం ఉందని నిర్ధారించి 14,525 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 20 మంది చిన్నారులకు కాటరాక్టు ఉన్నట్లు నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. మరో 148 మందికి ఇతర కంటి సమస్యలు ఉండటంతో వారికి అవసరమైన ఆపరేషన్లు చేశారు.

దృష్టి లోపించి.. సేవలు నిలిచి!

గత ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి ఈ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కంటి పరీక్షలు చేయడం మానేసింది. కేవలం పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవ్వాతాతలకు, సాధారణ ప్రజలకు కంటి పరీక్షలు చేసేవారు కరువయ్యారు. దీంతో వారు వైద్యం కోసం కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు రావాల్సి వస్తోంది. మరికొందరు కర్నూలు, నంద్యాలలోని ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి చికిత్స తీసుకుంటున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో అధికమైందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం



జిల్లాలో అర్హులైన వారందరికీ గతంలోనే కంటివెలుగు కార్యక్రమం కింద కంటి పరీక్షలు నిర్వహించాము. జిల్లాలో అందరికీ కంటి పరీక్షలు నిర్వహించినట్లు భావిస్తున్నాం. ఇంకా ఎవ్వరైనా ఉంటే కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవచ్చు. కంటి వెలుగు కింద ప్రస్తుతం పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. కంటి చికిత్సలపై ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను బట్టి మలి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సంధ్యారెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి, కర్నూలు

ఈ–ఐ కేంద్రాల్లో కంటి చికిత్సలు నిలిచాయి



జిల్లాలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్లలో ఐదు చోట్ల ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలు గత సెప్టెంబర్ చివరి వరకు కొనసాగాయి. గత నెల నుంచి ఆయా కేంద్రాల్లో సేవలు అందడం లేదు. అపోలో సంస్థకు ఇచ్చిన టెండర్ గడువు(ఒప్పందం గడువు) ముగిసినందున వారు పరికరాలు తీసుకుని వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించి రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాము. టెండర్లు పిలిచి నూతన సంస్థకు బాధ్యతలు అప్పజెప్పనున్నారు. అవి తెరిస్తే మళ్లీ కంటి పరీక్షలు ప్రారంభించే అవకాశం ఉంది.

– డాక్టర్ ఆర్. మాధవి, డీసీహెచ్ఎస్, కర్నూలు

మహానందీశ్వరుడి దర్శన వేళల్లో మార్పులు

- ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి



మహానంది: కార్తీక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహానందీశ్వరుని దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఈఓ ఎన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున మూడు గంటల నుంచే మంగళవాయిద్యాలు, మేలుకొలుపు, సుప్రభాతం పూజలు, 3.30 నుంచి బిందెసేవ, అభిషేకం నిర్వహిస్తామన్నారు. 4.00 నుంచి 4.30 గంటల వరకు అష్టవిధ మహామంగళ హారతులు, మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వదర్శనం, శీఘ్రదర్శనం, మహదాశీర్వచన దర్శనం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 1.00 గంట వరకు స్వామివారికి మహానివేదన సమర్పణ ఉంటుందన్నారు. అనంతరం యథావిధిగా దర్శనాలు, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు అష్టవిధ మహామంగళహారతులు ఉంటాయన్నారు. రాత్రి 9.30 నుంచి 10.00 గంటల వరకు మహానివేదన, 10.30 గంటల వరకు ఏకాంతసేవ పూజలు జరుగుతాయన్నారు. పూజా కార్యక్రమాల నుంచి పారిశుద్ధ్య పనుల వరకు ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

టీడీపీ నేతా.. మజాకా!

- అధికార పార్టీ నేతను కాదని మద్యం దుకాణం ప్రారంభం
- అధికారుల అండతో షాప్ సీజ్ చేసిన వైనం

కర్నూలు (రూరల్): లక్కీ డిప్‌లో దుకాణం దక్కినప్పటి నుంచి బెదిరిస్తున్నా అతను తలొగ్గలేదు. చంపేస్తామన్నా వెనకడుగు వేయలేదు. దాడులు చేసినా.. భయపడకుండా ధైర్యంగా దుకాణాన్ని ప్రారంభించాడు. అయితే టీడీపీ నేతలు అన్నట్లుగానే బరితెగించారు. తమను కాదని షాప్ నిర్వహించలేవు చెప్పి మరీ .. చివరకు అధికారాన్ని అడ్డం పెట్టుకుని దుకాణాన్ని సీజ్ చేశారని బాధితుడు వాపోతున్నాడు. కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో నిర్వహిస్తున్న నిరీక్షణ వైన్స్ (షాప్ 22)ను శనివారం అధికారులు సీజ్ చేశారు. దేవదాయ శాఖ స్థలంలో మద్యం దుకాణాన్ని నిర్వహించకూడదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, దేవదాయ శాఖ ఈఓ దినేష్ సమక్షంలో మద్యం దుకాణాన్ని సీజ్ చేశారు. నోటీసు ఇవ్వకుండా ఎలా సీజ్ చేస్తారని దుకాణ నిర్వాహకుడు తెలంగాణ రాష్ట్రం దేవరకద్ర గ్రామ వాసి వింజమూరి కృష్ణారెడ్డి అధికారులను ప్రశ్నిస్తున్నా షాప్‌కు తాళం వేశారు.

మాకు ఆత్మహత్యే శరణ్యం..



దుకాణ యజమాని వింజమూరి కృష్ణారెడ్డి

ఈ సందర్భంగా బాధితుడు వింజమూరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తమ వ్యాపారానికి అడుగడుగునా అడ్డుపడుతున్నారని తెలిపారు. ఇంత అన్యాయం ఎక్కడా లేదని వాపోయాడు. లాటరీలో దుకాణం దక్కినప్పటి నుంచి ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వారి అనుచరులు పంచలింగాలకు చెందిన నర్వ రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌వీ కన్వెన్షన్, ఎన్‌వీ గ్రాండ్ హోటల్ యజమాని ఎన్‌వీ వెంకటరెడ్డి, పంచలింగాల ప్రకాష్, గార్గేయపురానికి చెందిన జూటూరు కౌశిక్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి అనే వ్యక్తులు నిత్యం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయంపై నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసినా ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. 25 మంది స్నేహితులం కలసి 40 అప్లికేషన్లు వేస్తే ఒక దుకాణం దక్కిందన్నారు. షాపు సీజ్ చేయడంతో ఆత్మహత్యే శరణ్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవదాయ శాఖకు చెందిన భూమి అయితే వెంచర్ వేసి ప్లాట్లు వేసినప్పుడు అధికారులు ఏమి చేశారని ప్రశ్నించారు.



పంచలింగాలలో మద్యం దుకాణాన్ని సీజ్ చేసిన అధికారులు

నీళ్లున్నా ఇంత నిర్లక్ష్యమా?

- నీటి వృథాను అరికట్టడంలో అధికారుల వైఫల్యం
- చెరువులు, రిజర్వాయర్లు నింపకపోవడంతో నీటి సమస్య
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు కల్చరల్: ‘వర్షాలు సమృద్ధిగా కురిసి కళ్లెదుట నీళ్లున్నా చెరువులు, రిజర్వాయర్లు నింపుకోలేని దుస్థితిలో ఉన్నాం.. నీళ్లున్నా అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం వల్ల నీటిని సముద్రం పాలు చేసుకుంటున్నాం’ అని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక ప్రణాళిక తదితర అంశాలపై ఉమ్మడి జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సమావేశాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 72 చెరువులు నింపడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహించారు. తాగు, సాగునీటి కష్టాలు చూస్తున్నా ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టి రిజర్వాయర్లు నింపాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు.

- మహిళా శిశు సంక్షేమం, ఎస్టీ నిధులకు సంబంధించి సెప్టెంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఆ నిధులతో పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఏఈలకు తెలిపామని, అయినా ఒక్కరు కూడా పట్టించుకోలేదని, వారికి తక్షణమే నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జీజీఎం పనుల కింద టెండర్లు వేసిన వాటికి తగిన పరిష్కారం చేయాలని పేర్కొన్నారు.
- ఉమ్మడి జిల్లాలో డ్రైనేజీ, రోడ్లు తదితర అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో సభ్యుడికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అందులో ఇప్పటికే 38 మందికి మంజూరు చేశామన్నారు. మిగిలిన 15 మందికి త్వరలో మంజూరు చేస్తామని తీర్మానించారు.
- గ్రామాల్లో 24 గంటలు వీధి లైట్లు వెలుగుతున్నా, నీరు వృథా అవుతున్నా నివారించలేని స్థితిలో అధికారులు ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

- ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ వైద్యం మందగించిందని, గ్రామీణ ప్రజలకు వైద్యం అందడం లేదన్నారు. చాలా పీహెచ్‌సీలలో మందులు బయటకు రాస్తున్నారని పేర్కొన్నారు. కోసిగి పాఠశాలలో పెచ్చులూడిపోవడంతో చెట్టు కింద పాఠాలు చెబుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. కేన్సర్ యూనిట్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు.
- ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ సి.బెళగల్ మండలంలో పీహెచ్‌సీలో వైద్యులు లేరని, ప్రజలు అనారోగ్యం బారిన పడి వైద్యులు లేకపోవడంతో వెనక్కు వెళ్తున్నారన్నారు. మండలంలో నీటి సమస్య ఉండటం వల్ల చాలా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్ పాటించరా?

పెన్షన్ల పంపిణీలో ప్రొటోకాల్ పటించడం లేదని పలువురు జెడ్పీటీసీలు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. చోటామోటా టీడీపీ కార్యకర్తలు ఇందులో పాల్గొంటున్నారని, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలను భాగస్వామ్యం చేయకపోవడం బాధాకరమన్నారు. పల్లె పండుగ కార్యక్రమాలను గ్రామసభలు, మండల సభలు జిల్లాపరిషత్ తీర్మానం లేకుండా ఎలా ప్రారంభిస్తారని, పనులు ఎలా చేస్తారని మండిపడ్డారు.

- ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం దాకా హైవే పనులు ఆగిపోయాయన్నారు. మున్సిపల్, హైవే అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు.
- సమావేశాల్లో ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు వారి మండలాల సమస్యలపై మాట్లాడారు. అధికారులు వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, వైస్ చైర్మన్లు దివ్య, దిల్షాద్ నాయక్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఏఓ జితేంద్ర, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి మృతదేహం లభ్యం


ఆదయ్య (ఫైల్)

రుద్రవరం: మండల కేంద్రానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు రిజర్వాయర్‌లో వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితమే తెలుగుగంగ ప్రధాన కాల్వలో మృతదేహం కొట్టుకొచ్చిన విషయం వైరల్ అయ్యింది. రుద్రవరం పోలీసులు శనివారం ఆ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఎర్రగుంట్ల గ్రామ వాసి ఆదయ్య (78)గా గుర్తించారు. మతి స్థిమితం లేక అక్కడి నుంచి రుద్రవరం వైపు వచ్చి ప్రమాదవశాత్తు కాల్వలో పడినట్లు మృతుడి కుమారుడు వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

డీఎంహెచ్ఓ తనిఖీ


ప్యాపిలి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

ప్యాపిలి: ప్రభుత్వ వైద్య సేవలు అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆదేశించారు. ఆయన శనివారం ప్యాపిలి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందుల వివరాలు, కావాల్సిన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన వైద్యాధికారులు శ్రీవాణి, నితీశ్‌కుమార్‌తో మాట్లాడారు. ప్రజలకు అనునిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వెంగళాంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, ప్యాపిలి-1 సచివాలయంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేసిన జిల్లా అధికారి, ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచనలు చేశారు.

విద్యుత్ నూతన సర్కిళ్లకు ఉద్యోగుల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ: నూతన జిల్లాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ సర్కిళ్లకు ఉద్యోగులను కేటాయించారు. ఈ మేరకు విద్యుత్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు విద్యుత్ సర్కిల్‌లోని కొంతమంది ఉద్యోగులను నంద్యాల సర్కిల్‌కు కేటాయించారు. అందులో భాగంగా 10 మంది జేఏఓలలో ఐదుగురిని, 31మంది సీనియర్ అసిస్టెంట్లలో 12 మందిని, 21 మంది జూనియర్ అసిస్టెంట్లలో 9 మందిని, 15 మంది ఓస్ఓలలో ఏడుగురిని, ఇద్దరు వాచ్‌మన్లలో ఒకరిని నంద్యాల సర్కిల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌ను వినియోగించండి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సంఘాలలో ఉన్న సభ్యులకు నిర్దిష్టమైన డేటా కోసం ప్రొఫైల్ యాప్‌ను వినియోగించుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల సూచించారు.శనివారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడురు మున్సిపాల్టీలకు చెందిన సీఓలు, ఆర్పీలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ యాప్ ద్వారా ప్రతి ఆర్పీ తన పరిధిలోని అన్ని సంఘాల వివరాలు, సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పొరపాట్లు లేకుండా కచ్చితమైన వివరా లు సేకరించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి జిల్లాలోని అన్ని సంఘాల వివరాలు పూర్తి చేయా లని ఆదేశించారు. టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటలక్ష్మి, ఏఓ ఆసిఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో రాఘవేంద్రస్వామి మూలబృందావనం

బలి పాడ్యమి వైభవం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాఘవేంద్ర స్వామి మఠంలో బలి పాడ్యమి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో పాడ్యమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సంస్థాన దేవతామూర్తులు మూల జయ దిగ్విజయ రాములకు మహాభిషేక పూజలు గావించారు. వేలాది మంది భక్త జనం మధ్య పూజామందిరంలో రాములోరి మహా అభిషేక వేడుక కమనీయంగా సాగింది. వేదమంత్రోచ్చరణ, భక్త జన హర్షధ్వనుల మధ్య వేడుక సాగింది. అలాగే రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు గావించారు. వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో శ్రీమఠంలో సందడి నెలకొంది. ముందుగా భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాద కౌంటర్లు కిక్కిరిశాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎస్ఐ రామంజులు, ఏఎస్ఐ పెద్దయ్య తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


మూలరాముల పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి


హాజరైన భక్తులు

హాకీ జిల్లా జట్ల ప్రకటన


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): నెల్లూరు జిల్లా, సౌతంపూర్ పట్టణంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి అండర్-17 హాకీ బాలబాలికల పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం రాష్ట్రపోటీల్లో పాల్గొనే బాల బాలికల జట్లను అభినందించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ప్రకటించారు. బాలుర విభాగంలో నాగ చైతన్య, జగన్మోహన్ రెడ్డి, చరణ్, ధనుష్, జై చరణ్, త్రిలోక్ నాయక్, రవీంద్ర, తస్వీర్, వాజిద్, వినయ్‌కుమార్, రామ్‌చరణ్ బాబు, ఫయాజ్, మోహన్ బన్ని, ఫరహాస్, శ్రీనివాస రెడ్డి, బాలికల విభాగంలో యామిని, అనసూయ, ప్రణీత, అంజలి, అనిత, ఓంజ్యోని, మనీషా, ఆర్.మనీషా, ప్రియ, ప్రత్యూష, మమత, లావణ్య, ఐశ్వర్య, ప్రణీత, సోఫియా, రేణుకా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి పరమేష్, హాకీ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాట్లు


సి.బెళగల్ గురుకుల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్యదర్శి గిడ్డయ్య

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య పరిశీలించారు. శనివారం ఎస్జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సుంకారావుతో పాఠశాలకు చేరుకున్న ఆయన పీడీ రాఘవేంద్రతో కలిసి గురుకుల మైదానంలోని కోర్టులను, పరిసరాలను, క్రీడాకారులకు కావాల్సిన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్ – 17 సెపక్‌తక్రా పోటీలను నిర్వహించడం జరుగుతుందని, పోటీలో 13 జిల్లాలకు చెందిన 150 మంది బాలబాలికలు పాల్గొంటారని తెలిపారు. పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పీడీలకు సూచించారు. పాఠశాల పీఈటీ ప్రభాకర్, జిల్లా కోచ్ మధు తదితరులు ఉన్నారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు కృషి


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్యాపిలి: వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, డోన్, ఆదోని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, పార్థసారథి అన్నారు. మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహల వద్ద శనివారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠకు మంత్రితో పాటు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాల్మీకి గురుపీఠం పీఠాధిపతి ప్రసన్నానంద స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో వాల్మీకి సోదరులనుద్దేశించి వక్తలు మాట్లాడారు. వాల్మీకులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని మంత్రి, ఎమ్మెల్యేలు అన్నారు. వాల్మీకి పెద్దలు వలసల రామకృష్ణ, టి.శ్రీనివాసులు, సరస్వతి, ఈశ్వరయ్య, కుబేరస్వామి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమం తనిఖీ


చిన్నారికి టీకా వేస్తున్న డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని ఓల్డ్ కల్లూరు సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా అందించాలన్నారు. ముఖ్యంగా బుధ, శనివారాలలో అన్ని సెషన్స్‌లలో తప్పకుండా ఏఎన్ఎం, ఆశాలు టీకాల కార్యక్రమం నిర్వహించాలన్నారు.టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన సురేష్ (32) విద్యుదాఘాతంతో శనివారం రాత్రి మృతి చెందాడు. బంధువులు, అవుట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సురేష్ ఇంట్లో ఫ్యాన్ వేసేందుకు స్విచ్ వేస్తుండగా.. షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య రాజమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపారు.

జిల్లాలో రూ.11 కోట్లతో రోడ్ల మరమ్మతులు

కర్నూలు న్యూసిటీ: మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రంలో రెండు విడతలలో రూ.640 కోట్లతో 1600 కి.మీ మేర రోడ్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ మేరకు కర్నూలు నగరంలోని ఆర్ఎస్ కూడలిలో మంత్రి టీజీ భరత్, జాయింట్ కలెక్టర్ నవ్య, నగర కమిషనర్ రవీంద్రబాబు, రోడ్ల, భవనాల శాఖ ఎస్ఈ మహేశ్వరరెడ్డితో కలిసి రోడ్ల మరమ్మతు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతగా రూ.11.16 కోట్లతో 412 కి.మీ. రోడ్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. రెండవ దశలో రూ.8.71 కోట్లతో 426 కి.మీ రోడ్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ.. మొదటి విడత పనులు డిసెంబర్ నాటికి, రెండవ విడతలో సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం భక్తులు విరివిగా విరాళాలు అందించినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ విజయరాజు తెలిపారు. కర్ణాటకలోని రాయచూర్ పట్టణ వాస్తవ్యులు రవీంద్రకుమార్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.1,00,000 మొత్తాన్ని దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


మృతుడి భార్యకు జాతీయ పతాకం అందించి వందనం చేస్తున్న సీఐ మాహబుచాన్

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ (జవాన్) అనిల్‌కుమార్ అంత్యక్రియలు పోలీస్ లాంఛనాలతో ముగిశాయి. గత గురువారం వెల్దుర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన చిన్న మునిస్వామితో పాటు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం కర్నూలులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతని స్వగ్రామం కొండాపురానికి తీసుకురాగా, కుటుంబ సభ్యులు శనివారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. దీంతో జీసీ సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ బెటాలియన్‌కు చెందిన సీఐ మాహబుచాన్ ఆధ్వర్యంలో 11 మంది కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్ శవపేటికపై జాతీయ పతాకం ఉంచి సలామిన్‌చెస్ నిర్వహించి అంత్యక్రియలను ముగించారు. జవాను అంత్యక్రియలకు గ్రామస్తులతో పాటు పెద్దఎత్తున బంధుమిత్రులు, ప్రజలు హాజరయ్యారు. స్థానిక హెడ్‌కానిస్టేబుల్ తిమ్మప్ప, హోంగార్డు విజయ్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో మానవత్వం మంట కలిసే ఓ దారుణం జరిగింది. పుట్టుకతోనే దివ్యాంగురాలు, మతిస్థిమితం ఉండదు, మాటలు రావు, చెవులు వినిపించవు. ఆకలి వేస్తే అన్నం కూడా అడగలేని స్థితిలో ఉన్న యువతి (24) పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి ప్రయత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. యువతి తల్లిదండ్రులు శుక్రవారం యథావిధిగా వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. ఆమెకు సమయానికి అన్నం తినిపించేందుకు చిన్న కుమార్తెను ఇంటి వద్ద ఉంచి వెళ్లారు. ఈ స్థితిలో మధ్యాహ్నం ఇంటి బయట యువతి ఒంటరిగా కూర్చొని ఉండటాన్ని అదే గ్రామానికి చెందిన ఆలూరు బోయ రాముడు చూశాడు. వీధిలో ఎవరు లేకపోవడంతో ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. బాధితురాలు గట్టిగా అరవడంతో ఇంట్లో ఉన్న చెల్లెలు బయటకు రాగా.. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి పారిపోయాడు. ఘటనపై బాధితురాలి చెల్లి తల్లిదండ్రులకు తెలపడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

మృత్యుంజయుడు

- కుందూనది ప్రవాహంలో కొట్టుకుపోయిన రైతు
- నదిలో జమ్ము గడ్డి సాయంతో క్షేమంగా బయటకు..


క్షేమంగా బయటపడిన కృష్ణారెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ఓ రైతు కుందూనది ప్రవాహంలో కొట్టుకుపోయి జమ్ము గడ్డి సాయంతో సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి అనే రైతు గ్రామ సమీపంలోని కుందూనది అవతలివైపు 3.50 ఎకరాల విస్తీర్ణంలో మిరప పంట సాగు చేశాడు. పొలానికి సాగునీరు మళ్లించుకునేందుకు శనివారం మరికొంత మంది రైతులతో కలిసి పొలానికి వెళ్లాడు. సాగునీటి విడుదలకు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లే క్రమంలో నీటిలో దిగి ప్రవాహానికి కొట్టుకుపోతుండటంతో తోటి రైతులు కాపాడే ప్రయత్నం చేశారు. నీటి ఉధృతికి కనిపించకుండా పోవడంతో నీటిలో గల్లంతయ్యాడని భావించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో కుందూనది వెంట గాలింపు చర్యలు కొనసాగించారు. అయితే కృష్ణారెడ్డి నీటిలో కొట్టుకుపోతూ వల్లంపాడు- కలుగొట్ల గ్రామాల మధ్యలో నదిలో ఉన్న జమ్ము గడ్డిని పట్టుకొని సురక్షితంగా ఒడ్డుకు చేరాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన రైతు క్షేమంగా బయటపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

రూ.30 లక్షలతో కళాశాల అభివృద్ధి


మాట్లాడుతున్న నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.30 లక్షలతో నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పూర్వ విద్యార్థులు వెంకటేశ్వర్లు, హరినాథగుప్త, తదితరులు తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తాము చదువుకున్న కళాశాలను అభివృద్ధి చేయాలన్నదే తమ ఉద్దేశమన్నారు. అలాగే ఈ నెల 9వ తేదీన పూర్వ విద్యార్థులందరితో కలిసి కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులందరూ పాల్గొని కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తారని చెప్పారు. ఇప్పటికే మినరల్ వాటర్‌ప్లాంట్, ల్యాబ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వంద మంది విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఓడీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా దాచి ఉన్న ఉంచిన 20 బ్యాగుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఓ రామాంజనేయులు తెలిపారు. కర్నూలు నగరంలోని ఛత్రి బాగ్‌లోని ఓ ఇంట్లో 12 బ్యాగులు, దండిగేరిలోని మరో ఇంట్లో 8 బ్యాగుల బియ్యాన్ని దాచి ఉంచినట్లు సమాచారం రావడంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

- వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 96762 11033. [L-783255]
- వాసవీ గ్రూప్ వారి లగ్జరీ విల్లా ఓపెన్ ప్లాట్లు బాలానగర్, షాద్‌నగర్(Hyd) దగ్గర, బెంగుళూరు హైవే. 180 గజాలు రూ.32 లక్షలు. సెల్: 83338 55099. [L-796384]

PLOT FOR SALE

- సంతోష్‌నగర్ వెనుక స్కందా విల్లాస్ ఆనుకొని 5.1/2 సెంట్లు ఉత్తరము, పుల్లారెడ్డి కాలేజి వెనుక పడమర 5 సెంట్లు అమ్మబడును. ✆ 94407 68619. [L-796381]
- ఇండస్ట్రీయల్ హబ్‌గా మారుతున్న ఓర్వకల్లు హైవే రోడ్డుకి అన్ని డెవలప్‌మెంట్స్‌తో తక్కువ ధరకు ప్లాట్లు అమ్మడానికి సిద్ధంగా ఉన్నాయి. శివ: 80999 09366, 99636 19327. [L-783264]
- కర్నూలు దిన్నెదేవరపాడు నుండి నంద్యాల చెక్‌పోస్టు పోయే 100 అడుగుల రోడ్డుకు దగ్గరలో గల భార్గవ్ ఇన్‌ఫ్రాజెక్ట్స్ వెంచర్ నందు తూర్పు ఫేస్ గల 29x60 (2ప్లాట్లు), పడమర ఫేస్ గల 29x60 (2ప్లాట్లు) అమ్మకమునకు గలవు. సంప్ర: 9949966477. [L-783258]
- కర్నూలు-పంచలింగాల స్కంద గార్డేనియ వెంచర్ డి. బ్లాక్ నందు 30X50 సైజు గల 3.5 సెంట్ల పడమర ఫేస్ ప్లాట్ నెం.12 అమ్మకానికి కలదు. సెల్: 90529 59380. [L-796370]
- ఫ్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు ఆనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-796597]

LAND FOR SALE

- కర్నూలు ఉల్లిందకొండ తాండకు పోయే రోడ్డు నందు 4.1/2 ఎకరముల 9 సం॥ చెట్లు గల మామిడి తోట కూడా అమ్మకమునకు కలదు. యుగంధర్: 9949966477. [L-783259]
- కర్నూలు జిల్లా ఆలూరు తాలుక దేవనకొండ మండలం తెర్నెకల్లు పుల్లపురము గ్రామము. కాపకారీల వ్యవసాయ భూమి అమ్మబడును. ✆ 9866706916. [L-796385]
- వ్యవసాయ భూమి ఐదు ఎకరాలు సాగునీటి సదుపాయంతో కొక్కెరంచ-నాగంపల్లె రోడ్డుకు ఆనుకొని S.No: 611 కొక్కెరంచ గ్రామం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లాలో అమ్మబడును. ✆ 7702604921. [L-796383]

FLAT FOR SALE

- 2 BHK Flat (with Cup boards & False ceiling-ready to occupy) For Sale in Aiswarya Enclave, Somi Setty Nagar, Near Nandyal Check Post, Kurnool. Cell: 9494958383. [L-796599]

HOUSE FOR SALE

- MSS బాలాజీ Orchid విల్లాస్, కర్నూలులో తిరుపతి, బెంగుళూరు, హైదరాబాద్, సూరత్ ALL గ్రేటర్ సిటీ హైవేలకు అనుకొని రింగ్‌రోడ్ దగ్గర KUDA అప్రూవల్ అత్యధిక సౌకర్యాలు గల డూప్లెక్స్ హౌసెస్ మరియు ఇండిపెండెంట్ హౌసెస్ అమ్మకానికి కలవు. సంప్ర: 9182758409. [L-783262]
- తూర్పు-ఉత్తరం కార్నర్, నూతనంగా నిర్మించిన Duplex House (G+2) Fullly furnished (3000 sft) నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, వినాయక గుడి వెనుక భాగములో అమ్మకమునకు కలదు. Bedrooms 5 No.s, Halls 3No.s, Corridors 3No.s, Car Parking, Bore కలవు. సంప్రదించండి: 9440282771, 9703741054. [L-796367]
- Sale Building 28x78 Kurnool Auto Nagar on NH44 by side of Maruti Showroom Suitable Commercial. Fiaz 9985138260 [SCA-24000530]

TO - LET

- శరీన్‌నగర్ ప్రక్కన రామచంద్రనగర్‌లో 2 Bed Room House 1st Floorలో Roof Garden అన్ని వసతులు కలిగిన కొత్త ఇల్లు బాడుగకు ఇవ్వబడును. Govt Employeesకు Preference ఇవ్వబడుతుంది. బాడుగ: 15,000/- ✆ 90523 56257. [L-796378]

SERVICES

HEALTH CARE

UNANI

- దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్ మరియు చిన్న పిల్లల పోలియో వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. సంప్ర: M.D.షఫీ హకీమ్, కర్నూలు. సెల్: 88970 11918 [L-796588]

GYNECOLOGY

- డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు.✆ 88970 87874 [L-783253]

PHYSICIAN

- డా॥కె.చంద్రమౌళి రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ ఫిజీషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, అడ్రస్: శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [L-783254]

GENERAL & LAPROSCOPIC SURGEON

- KGN మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, KVR గార్డెన్, వడ్డేగేరి, కర్నూలు. ఆరోగ్య శ్రీ ద్వారా అపెండిక్స్, మొలలు, హెర్నియా, థైరాయిడ్, కాలికి క్లోమాలు, ఆర్థోపెడిక్, యూరాలజీ, ENT, సర్జికల్ గ్యాస్ట్రో, మొ॥ శస్త్ర చికిత్సలు చేయబడును. ✆ 9346348653 [L-783252]

ORTHOPEDIC SURGEON

- డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శేష పాలీ క్లీనిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666. [L-796586]

AYURVEDIC

- డా॥M.మహిపాల్, M.S.,(AYU) పైల్స్, ఫిస్టులా, ఫిషర్‌కు ఆయుర్వేద క్షార సూత్ర ద్వారా శాశ్వత పరిష్కారం. ప్రతి నెల 2వ మరియు 4వ ఆదివారం చూడబడును. శ్రీ వెంకటసాయి ఆయుర్వేదిక్ హాస్పిటల్, వి.ఆర్.కాలనీ, కర్నూలు. ఫోన్: 99599 49739. [L-796587]

MARRIAGE SERVICES

వరుడు కావలెను

- 3 నెలలకే విడిపోయిన 29 సం॥లు, B.Sc, LLB (3rd Year), చదివిన ముస్లిం అమ్మాయికి సాఫ్ట్‌వేర్/బి.ఫార్మసీ చేసిన ముస్లిం అబ్బాయి వరుడు కావలెను. కనీసం 5సం॥లు అమ్మాయి తల్లిదండ్రుల దగ్గర కలిసి ఉండాలి. మెడికల్ షాపు పెట్టించి ఇవ్వబడును. ✆ 8374502559. [L-796589]

OLD AGE HOME

- హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు మనుషులు కావలెను. జీతము 12000 - 15000 + ఉచిత వసతి + భోజనము. ఫోన్: 9347556162, 8309615249 [HA-8889]

WANTED

- ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ టీమ్ కావలెను. ఫిక్స్‌డ్ శాలరీ+నెలకు గిఫ్ట్స్+మంచి ఇన్సెంటివ్స్. Join With us for Bright Future & Unlimited Income. ✆ 9182758409. [L-783263]
- ప్రముఖ ఫైనాన్స్ & ఇన్సూరెన్స్ కంపెనీకి లైఫ్, హెల్త్, మోటార్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు మ్యూచువల్ ఫండ్స్ కొరకు బిజినెస్ అసోసియేట్స్ కావలెను. సంప్ర: 7993767337. [L-796600]
- పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు పంపు బాయ్స్ కావలెను. కారు, లారీలు నడుపుటకు డ్రైవర్స్ కావలెను. ఆసక్తి గల వారు బయోడేటా వాట్సప్ చేయగలరు. సెల్: 80086 78969. [L-796371]
- డోన్ KVS హాస్పిటల్ ల్యాబ్‌లో (రక్త పరీక్షలు) చేయుటకు ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. సంప్రదించండి: 9533119937. (డాక్టర్ సెల్) 9966376749. PRO [L-796377]
- మదీనా ఆధార్ సెంటర్‌లో పనిచేయుటకు తెలుగు టైపిస్టు, ఆన్‌లైన్ వర్క్ చేయుటకు ఒకరు బొప్పున కావలెను. షాప్: 20, 21, పుల్లారెడ్డి కాంప్లెక్స్ వెనుక, కలెక్టర్ ఆఫీస్ దగ్గర, కర్నూలు. ✆ 9542226765. [L-796376]
- WANTED EM LADY TEACHERS FOR 1 to 5 CLASSES HINDI, ENGLISH, & MATHS. ADITHYA SCHOOL, KALLUR. ✆ 9490130596, 08518-232596. [L-538]
- మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు, ఫీమేల్ టెలికాలర్స్, మండల విలేఖరులు కావలెను. జగదీష్ మాల్, 2nd ఫ్లోర్, షాప్ నెం: 223, బిర్లా కాంపౌండ్, కర్నూలు. సెల్: 94403 84846 [L-796374]
- కర్నూలు సిటీలో వివిధ ప్రాంతాలలో మా సంస్థ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ (స్త్రీలు), రూం బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, 8 గంటలు డ్యూటీ సమయం. మరియు ఇతర రాష్ట్రాలలో, దేశాలలో పనిచేయుటకు కూడా వర్కర్స్ కావలెను. సంప్ర: 9494333443, 8341957788. [L-796598]
- WANTED Teacher for 4th to 9th Maths, English and Hostel Warden Male Clerk cum Computer Operator. Contact: Kurnool. 9440290162. [L-538]
- Wanted English Fluent & Experienced Teachers for Higher & Lower Classes in Telugu, Maths, English, & Social and Receptionist. Salary Negotiable. Contact: Unique Digital School, Knl. Cell: 9704575543. [L-783256]
- SREDPU Programme (HIV/AIDS): పోస్టు: Out Reach Work, Qly: 10th to Degree, జీతం: 10,500+TA1500. ఇంటర్వ్యూ తేది: 07.11.2024, ఆఫీస్: గణేష్‌నగర్, Opp: మేయర్ క్యాంప్ ఆఫీస్, కర్నూలు. సెల్: 9701190369. [L-783257]
- విజయ మహిళా మండలి-HIV Prevention Unit కర్నూలు నందు పనిచేయుటకు ప్రోగ్రాం మేనేజర్ కావలెను. Qly: MSW, Socilogy, RD, Psychology. Salary: 21,000+Travel-1,400/-, అర్హత కలిగిన వారు క్రింది Mail ID: vmmknltiapsacs@gmail.comకు రెజ్యూమ్స్ పంపవలెను. సెల్: 94405 54319. [L-783261]
- SR Defence Academy, Tirupati నందు పని చేయుటకు PRO's, PET and Junior Lecturer's కావలెను. ఆకర్షణీయమైన జీతం. Qual: Any Degree. 7893318282, 6305789148. [T-1259129]
- అన్ని జిల్లాలలో కార్పొరేట్ బ్యాంక్ లందు పనిచేయుటకు Assistant Managers, BDM, Cashiers, Attenders కావలెను. జీతం: 17,000-30,000, 88979 09097. [T-2367]
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP - 40 వేలు, ఫ్రీ రూమ్+ భోజనం. HYD. Ph: 8317512135 [HA-98890]
- ఆర్వి సూపర్ మార్ట్, కోయిలకుంట్లలో పనిచేయుటకు స్టాఫ్ కావలెను. 25సం.లోపు డిగ్రీ & కంప్యూటర్ నాలెడ్జి ఉండవలెను. Ph: 9989907171 [HA-14748]
- శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165